క్లుప్తంగా

అమ్మవార్ల నిమజ్జనం



కొమరిపాలెంలో అమ్మవారి ఊరేగింపు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం, పందలపాక గ్రామాల్లో అమ్మవార్ల నిమర్జనం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, తీన్‌మార్ డప్పులతో గ్రామోత్సవం జరిపారు. ఆయా ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

జగన్మాతకు నెమలి పింఛాలతో అలంకరణ



నెమలి పింఛాల చీరతో జగన్మాత, చిత్రంలో కనకాచారి కుటుంబ సభ్యులు

రాజానగరం: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు, ఆలయ 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చక్రద్వారబంధంలోని దేవీచౌక్‌లో కొలువైన జగన్మాతకు నెమలి పింఛాలతో శనివారం అలంకరణ చేశారు. ఆ గ్రామానికి చెందిన నిడదవోలు కనకాచారి కుటుంబ సభ్యులు నెమలి పింఛాలతో తయారు చేసిన చీరను అమ్మవారికి అలంకరించారు. మకర తోరణం మాదిరిగా వెనుక భాగంలో కూడా రూపొందించారు.

వేద పండితుడికి సన్మానం



హనుమంతాచార్యులును సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సంపర గ్రామానికి చెందిన వేద పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అన్నారు. ఆ గ్రామంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ, మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం ఆయనను ఘనంగా సన్మానం చేశారు. దేవీ నవరాత్ర ఉత్సవాలకు సంబంధించి తొమ్మిది రోజులు అమ్మవారికి వివిధ విశేష అలంకరణలు, పూజలు నిర్వహించినందుకు ఈ కార్యక్రమం జరిపారు. ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి, మెమెంటో అందజేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



బలభద్రపురంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బిక్కవోలు: బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ అన్నారు. బలభద్రపురం గ్రామంలోని రాజానగరం -రాయవరం రోడ్డులో ఉన్న జానకిరామ గ్రాండ్ ఫైర్ వర్క్స్ తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. లేకపోతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ ఉన్నారు.

భారీ వర్షంతో మెట్ట పంటలకు మేలు



రంగంపేటలో సాగు చేస్తున్న మిరప చేను

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఒక్కసారిగా మారిపోయింది. సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. ఏడీబీ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు వర్షం కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయారు. ఈ వర్షం మండలంలోని వరి, మినుము పంటలకు ఎంతో మేలు చేస్తుందని, అలాగే ఉద్యాన పంటలైన మొక్కజొన్న, బొప్పాయి, జామ, మిరప, ఆయిల్ పామ్ పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరల పంటలకు ఎంతో ఉపయోగమని రైతులు తెలిపారు.

నమూనా చెక్కు అందజేత

కోరుకొండ: ఆటోడ్రైవర్ల సేవలో పథకం నమూనా చెక్కును ఆటోడ్రైవర్లకు శనివారం ఎమ్మెల్యే బలరామకృష్ణ అందజేశారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఇప్పటికే 658 మందిని అర్హులుగా గుర్తించామని, వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు.

దోచుకో.. దాచుకో..



పాత తుంగపాడులో జరుగుతున్న మట్టి తవ్వకాలు (ఫైల్)



తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టుకున్న లారీలు (ఫైల్)

- రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా
- యథేచ్ఛగా దోపిడీ

రాజానగరం: దొరికినంత దోచుకో .. దోచుకుంది దాచుకో అన్న విధంగా నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ సాగిపోతోంది. ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా, మీడియాలో ఎన్ని కథనాలు వచ్చినా డోంట్ కేర్ అన్నట్టు అధికారం బలంతో ఈ ముఠా తమ ఆగడాలను రోజురోజుకూ ఉధృతం చేస్తూనే ఉంది. పవర్ పాలిట్రిక్స్ ప్రభావంతో అధికారులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నారు. ఫలితంగా మూడు పొక్లెయిన్లు, ఆరు లారీలు అన్నట్టుగా మైనింగ్ వ్యాపారం జోరుగా సాగుతోంది.

గోదారి ఇసుకతో ప్రారంభం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోదావరి ఇసుక నిల్వలు మాయం కావడంతో ప్రారంభమైన దోపిడీ.. ఇప్పుడు కొండలను దాటుకుని, చెరువులను ఆక్రమించి, కాలువ గట్లను కూడా వదలకుండా కొనసాగుతోంది. ముఖ్యంగా ఎర్ర మట్టి (గ్రావెల్) ఈ ముఠా పాలిట ఎర్ర బంగారంగా మారింది. సాధారణంగా మట్టిని ఇల్లు, అపార్టుమెంట్ల పునాదులు నింపేందుకు, ప్లాట్లను ఎత్తు చేసేందుకు ఎక్కువగా వాడుతుంటారు. అయితే ఎర్రమట్టి (గ్రావెల్)ని వీటికి ఉపయోగించడం కంటే నర్సరీలకు ఎక్కువగా వాడుకుంటారు. మొక్కల పెంపకానికి ఈ మట్టి బాగా ఉపయోగపడటంతో నర్సరీల యజమానులు అధికంగా ధర చెల్లిస్తున్నారు. దీంతో ఎర్ర మట్టి నిక్షేపాలు ఎక్కడ ఉంటే అక్కడ ఈ మాఫియా ప్రత్యక్షమైపోతోంది. నామమాత్రపు అనుమతులు తీసుకుని, అధికార బలంతో రోజువారీ వందల కొద్దీ లారీలలో అక్రమ రవాణా సాగిస్తూ మట్టి నుంచి కాసులు పిండుకుంటోంది.

కాసుల వాన

రాజానగరం మండలంలో ఎర్రమట్టి ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో ఉన్న కొండలు చాలా వరకూ తరిగిపోయాయి. ప్రస్తుతం మండలంలోని కొండగుంటూరు, నామవరం, సంపత్ నగరం, జి.యర్రంపాలెం, తుంగపాడు, సీతానగరం మండలం నల్లగొండలలో కొండల ఆనవాళ్లే కనిపిస్తున్నాయంటే ఈ దోపిడీ ఏ మేరకు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదే తరహాలో చెరువు గర్భాలనూ తోడేశారు. పొలాలు, తోటలను కూడా వదిలిపెట్టడం లేదు. చివరకు పోలవరం కాలువ గట్లను కూడా మిగల్చలేదు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా మట్టిని భారీ వాహనాలలో తరలిస్తుండడంతో రోడ్లు శిథిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో లారీలను అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదు. ఆపిన వాహనాలు గంటల్లోనే ఆయా ప్రాంతాల నుంచి మాయమవుతున్నాయి.

ఆయనదే ప్రధాన పాత్ర

> ఇసుక, మట్టి అక్రమ దందాలో నియోజకవర్గ ప్రతినిధిగా ఉన్న వ్యక్తిదే ప్రధాన పాత్ర. ఆయనకు తెలియకుండా ఒక్క లారీ కూడా బయటకు వెళ్లదు. అక్రమ మైనింగ్ సాగిస్తే తాట తీస్తానంటూ ఆయన చెప్పే మాటలకు, చేసే పనులకు అసలు సంబంధమే ఉండదు.
>
> – గంగిశెట్టి సోమేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, పాలచర్ల

భలే మంచి గిరాకీ

ఎర్రమట్టికి ఉన్న గిరాకీని మైనింగ్ మాఫియా సొమ్ములు చేసుకుంటోంది. లారీ ఎర్రమట్టికి రూ.9 వేల నుంచి 12 వేలు, ట్రాక్టర్‌కు రూ.4 వేల నుంచి 6 వేల ధర దూరాన్ని బట్టి ధర పలుకుతోంది. క్వాలిటీ ఉన్న ఎర్రమట్టి అయితే లారీకి రూ.15 వేలు చెల్లించడానికి కూడా నర్సరీ యజమానులు వెనుకాడటం లేదు. నర్సరీలకు సుద్ద పొరలేని ఎర్రమట్టి బాగా ఉపయోగపడుతుంది. ఈ మట్టిని ఏ ధరకైనా కొనుగోలు చేయడంతో దోపిడీకి బ్రేకులు పడకపోవడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఈ ప్రాంతం నుంచి కడియం, రావులపాలెం, మండపేట, కాకినాడ, మున్నగు ప్రాంతాలకు ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగుతోంది.

పైనుంచి ఆదేశాలు

మండలంలోని కలవచర్ల వద్ద ఉన్న పోలవరం కాలువ గట్ల నుంచి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది లారీలను గురువారం రాత్రి స్థానిక యువకులు కొందరు అడ్డుకుని, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అక్రమ రవాణా పై చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు చెప్పారు. ఇంతలోనే పైఅధికారుల నుంచి వర్తమానాలు రావడంతో వాటిని వదిలేశారు. అదేమని ప్రశ్నిస్తే వాటికి అనుమతులున్నాయంటూ కప్పదాటు సమాధానమిచ్చారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

సీతానగరం (రాజానగరం): సీతానగరం మండలం రఘుదేవపురం వద్ద శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరం నుంచి పురుషోత్తపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు రఘుదేవపురం పెట్రోలు బంకు వద్ద యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొంది. ఆ సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 32 మందిలో రఘుదేవపురానికి చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ఢీకొనడంతో కారు రోడ్డు పక్కనే తుప్పల్లో పడింది. అదృష్టవశాత్తూ కారులోని వారికి ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు.

పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు

బిక్కవోలు: తగ్గిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన డ్వాక్రా వీఓలతో సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీలో వచ్చిన మార్పులపై ప్రతి గ్రామంలోనూ డ్వాక్రా సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పందలపాక వెలంపేట కమ్యూనిటీ హాలు వద్ద పంచాయతీ కార్యదర్శి సూరిశెట్టి సురేష్ జీఎస్టీపై సమావేశం నిర్వహించారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులు



కృష్ణ కిరణ్, శ్యామల దంపతులను ఆశీర్వదిస్తున్న జక్కంపూడి రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణ కిరణ్, శ్యామల దంపతులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆశీర్వదించారు. కృష్ణ కిరణ్, శ్యామల దంపతుల వివాహ రిసెప్షన్ శనివారం అమలాపురంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయ్ రెడ్డి, పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకట రమణ, నాయకులు ఆర్‌వీవీఎస్ సత్తిబాబు చౌదరి తదితరులు హాజరయ్యారు.

యువజన విభాగమే వైఎస్సార్ సీపీకి వెన్నెముక

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- చంద్రశేఖరరెడ్డికి సత్కారం



అనపర్తిలో చంద్రశేఖరరెడ్డిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మహేంద్రవాడ గ్రామానికి చెందిన సబ్బెళ్ల చంద్రశేఖరరెడ్డి గ్రామ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా శుక్రవారం ఆయనను నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేస్తే అఖండ విజయం తథ్యమన్నారు. ముఖ్యంగా యువత పార్టీ కార్యాకలాపాల్లో చురుగ్గా పాల్గొని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడి సూరారెడ్డి, ర్యాలీ సత్తిబాబు, మల్లిడి చెల్లారెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, సబ్బెళ్ల పెద్ద సత్తిరెడ్డి, మల్లిడి నాగేశ్వరరెడ్డి, కర్రి సత్యనారాయణరెడ్డి, తాడి వెంకటరెడ్డి, కర్రి కృష్ణారెడ్డి (ఎస్‌వీ), ద్వారంపూడి వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ సరకులు ఇచ్చేదెప్పుడో!

- తొస్సిపూడిలో తెరచుకోని షాపు
- లబ్ధిదారుల ఎదురు చూపులు



తొస్సిపూడిలో నాలుగు రోజులుగా మూసి ఉన్న రేషన్ షాపు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీకి ఆటంకం ఏర్పడింది. అక్టోబర్ నెల ప్రారంభమై నాలుగు రోజులు గడిచినా రేషన్ షాపు తెరచుకోలేదు. అసలు ఈ నెల బియ్యం ఇస్తారో, లేదోనని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ రేషన్ షాపుపై జూలై నెలలో ఎంఎస్‌వో దాడి చేశారు. ఆ సమయంలో పది కేజీల పంచదార ఎక్కువగా ఉందంటూ డీలర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం ఆ షాపు బాధ్యతలను మరో వ్యక్తికి అప్పగించారు. ఆయనే ఆగస్టు నెలలో రేషన్ సరుకులను లబ్ధిదారులకు అందజేశారు. అయితే.. కొందరు వేలిముద్రలు వేసి, పంచదార తీసుకువెళ్లకపోవడంతో ఎంఎస్‌వో దాడి సమయంలో పది కేజీలు ఎక్కువ ఉందంటూ పాత డీలర్ హైకోర్టుకు వెళ్లాడు. దీంతో అతడికే మళ్లీ రేషన్ షాపును అప్పగించాలని కోర్టు ఆదేశించింది. కానీ ఆ ఉత్తర్వులు కింద స్థాయి అధికారులకు చేరే సరికీ ఆగస్టు నెలాఖరు పట్టింది. ఈ లోపు సెప్టెంబర్ నెల రేషన్ సరకులను కూడా కొత్త డీలరే పంపిణీ చేశాడు. ఇక అక్టోబర్ నుంచి కోర్టు ఆదేశాల ప్రకారం పాత డీలరే పంపిణీ చేయాలి. కానీ ఇంత వరకూ షాపు తెరవలేదు. ఈ వివాదంపై కొత్త డీలర్ కూడా కోర్టుకు వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ గ్రామంలో సుమారు 820 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఈ రేషన్ షాపు నుంచి సరుకులను అందజేయాల్సి ఉంది. కానీ ఇంత వరకూ అసలు ప్రారంభమే కాలేదు. ఈ విషయంపై ఎంఎస్‌ఓ రంగా ప్రసాద్ వివరణ కోరగా.. సమస్యను రెండు, మూడు రోజుల్లో పరిష్కారం చేస్తామని తెలిపారు.

కాటన్ సంచులతో పర్యావరణ పరిరక్షణ



సంపరలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు, పెద్దలు

పెదపూడి: పర్యావరణ పరిరక్షణకు కాటన్ సంచులను వినియోగించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. సంపర గ్రామంలో సంపర ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ర్యాలీ నిర్వహించారు. పాలిథిన్ సంచులు వాడకాన్ని తగ్గించాలని, కాటన్ సంచుల వినియోగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి ఒక కాటన్ సంచి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో మానవాళి మనుగడకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందన్నారు. గ్రామంలో 18 మంది టైలర్ల శ్రమదానంతో 2000 కాటన్ సంచులను తయారు చేసినట్టు తెలిపారు. వాటిని ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్డి వెంకటేశ్వర్లు, ఎంఈఓ -2 సీవీవీ సత్యనారాయణ, టీడీపీ నేత తిబిరిశెట్టి చిన్నారి, లయన్స్ క్లబ్ అడ్మిన్ మండ రాజారెడ్డి, సచివాలయం కార్యదర్శి ఎం.చిన్ని పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై సమాచారం ఇవ్వండి

అనపర్తి: ఎవరైనా బాణసంచాను అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను అనపర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీఎల్‌వీకే సుమంత్ కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రాలు, విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా తయారీ, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. షాపులు, నిల్వ గోదాములను జనావాసాలకు దూరంగా ఉంచాలన్నారు. ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా పాటించాలని, మైనర్లను పనిలో వినియోగించరాదన్నారు. ఎవరైనా అక్రమంగా బాణాసంచా నిల్వలు ఉంచితే 94407 96538 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రంగంపేట: చంద్రేడులో కొలువైన అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శనివారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మునుకుట్ల శివరామకృష్ణశర్మ ఈ కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు.

టిప్పర్ల అడ్డగింపు



రాఘవపురంలో టిప్పర్‌ను అడ్డుకున్న స్థానికులు

కోరుకొండ: సీతానగరం మండలం నల్లగొండ, కోరుకొండ మండలం రాఘవపురంలోని కొండలను తవ్వేసి టిప్పర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. అతి వేగంగా ఇవి రాకపోకలు సాగిస్తుండడంతో సమీపంలోని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి టిప్పర్లను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాఘవపురం వాసులు అడ్డుకున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో కొనసాగుతున్న అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లారీల రాకపోకల కారణంగా ఎగురుతున్న దుమ్ముతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

బాలాత్రిపుర సుందరిని దర్శించుకున్న ఏసీబీ కోర్టు జడ్జి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారిని శనివారం రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు దర్శించుకొని పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు అందించారు.

యువరాజారెడ్డి సేవలు అభినందనీయం



వ్యాయామ ఉపాధ్యాయుడు యువరాజారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు తీసుకున్న ఆయనను శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిర్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తయారు చేయడానికి యువరాజారెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంపీపీ తేతలి సుమ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమశిక్షణతో తర్ఫీదు ఇవ్వడం, క్రీడాకారులకు సామగ్రి సమకూర్చడంలో యువరాజారెడ్డికి ఎవ్వరూ సాటిరారన్నారు. అనంతరం యువరాజారెడ్డి, సంధ్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పందలపాక ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పంపన వీర వెంకట సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్ రెడ్డి, లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీ సూర్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులు.. ప్రయాణానికి ఇక్కట్లు



రాజానగరంలో సినిమా థియేటర్ వద్ద మురుగునీటి కారణంగా గోతులతో అధ్వానంగా మారిన రోడ్డు

రాజానగరం: సరైన నాణ్యతా ప్రమాణాలతో నిర్మించిన రోడ్లు పది కాలాల పాటు పదిలంగా ఉంటాయి. అయితే నాణ్యతకు తిలోదకాలు ఇస్తే మాత్రం మూడు రోజులకే అధ్వానంగా మారతాయి. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో పాత ఎన్‌హెచ్ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ రోడ్డుకు ఏటా మరమ్మతులు చేస్తున్నా, వెను వెంటనే గోతులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామంలోని సినిమా థియేటర్ ప్రాంతంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై, గోతులమయంగా మారింది. వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నీరు ప్రవహించడం సాధారణంగా జరిగేదే. కానీ ఇక్కడ రోడ్డుపై మండు వేసవిలోనూ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. సమీపంలోని సినిమా థియేటర్ నుంచి వెలువడే వ్యర్థాలతో కూడి మురుగు నీరు ప్రవహించడం వల్లనే రోడ్డు పాడైపోతోంది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఈ థియేటర్ నుంచి వాడకం నీటితో పాటు టాయిలెట్ల నుంచి వెలువడే వ్యర్థాలతో కూడిన మురుగు నీరు కూడా ఈ రోడ్డు పైకి వచ్చి చేరుతోంది. థియేటర్ నుంచి మురుగు నీరు బయటకు పోయేందుకు గొట్టాలను వేసుకున్న యాజమాన్యం.. ఆ మురుగు నీరు దిగువకు పోయేలా పక్కా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణం. ఈ విషయంలో కనీసం పంచాయతీ అధికారులు కూడా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. కాగా.. ఈ విషయంపై థియేటర్ ప్రతినిధులను ప్రశ్నించగా రోడ్డుపై ప్రవహించే మురుగు నీటితో తమకు సంబంధం లేదన్నారు. ఈ థియేటర్‌ను విక్రయించిన వ్యక్తులు, కొనుగోలు చేసిన వారితో మాట్లాడి, పక్కా డ్రైనేజీలు ఏర్పాటు చేసుకోవాల్సిందంటూ ముక్తసరిగా సమాధానమిచ్చారు.